క్లుప్తంగా

మరో చోటికి బోర్డులు మార్పు



సూచిక బోర్డును మరోచోటికి మార్చుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ హద్దులు సూచించేందుకు ఏర్పాటు చేసిన బోర్డులు ప్రధాన రోడ్డుపై ప్రమాదభరితంగా ఉన్న విషయం గురించి సాక్షి దినపత్రికలో సోమవారం 'ఆ బోర్డులు.. ప్రమాదాలకు పిలుపులు' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు గాను సంబంధిత అధికారులు స్పందించారు. ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా ఆదేశాల మేరకు కొంతన్‌పల్లి- దంతన్‌పల్లి గ్రామాల మధ్య హద్దులు సూచించే బోర్డులు ప్రధాన రోడ్డు పక్కన ఇరువైపులా ప్రమాదభరితంగా ఉన్న బోర్డులు మరో చోటికి మంగళవారం మార్చారు. ప్రమాదాల నివారణకు కృషి చేసిన సాక్షి దినపత్రికకు వాహనదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మ్యాథ్స్ టీచర్స్ ఫోరం నూతన కార్యవర్గం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల తెలంగాణ మ్యాథ్స్ టీచర్ ఫోరం అధ్యక్షుడిగా తాల్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం పాపన్నపేటలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్ , కోశాధికారిగా విక్రాంత్, మహిళా ఉపాధ్యక్షులుగా దివ్య తేజ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శివకుమార్, కిషన్, భద్రయ్య, భవాని ప్రసాద్, గాలి శ్రీనివాస్, పాల్గొన్నారు.

బగలాముఖి శక్తిపీఠంలో హోమం



ప్రత్యేక అలంకరణలో బగలాముఖి అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖి శక్తిపీఠంలో మంగళవారం అమావాస్య సందర్భంగా విశేష పూజ మహోత్సవాలు చేశారు. బగలాముఖి ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హైదరాబాదుకు చెందిన భాగ్యలక్ష్మి, వెంకట్‌రామిరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఐజి తివారి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుధారాణి, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, ఆలయ భూదాత పబ్బ రమేష్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



జీలుగ విత్తనాల కోసం వచ్చిన రైతులు

నర్సాపూర్ : మండలానికి 420 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయని, మంగళవారం రైతులకు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి దీపిక తెలిపారు. సబ్సిడీ పోను విత్తనాల బస్తా రూ.2137కు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతుల నుంచి ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్‌లు తీసుకుని టోకెన్లు అందచేస్తున్నామని, విత్తనాలు ఆగ్రో కేంద్రంలో, ప్యాక్స్ గోదాంలో అందజేస్తున్నారని వివరించారు. కాగా జీలుగ విత్తనాల ధరను అడ్డగోలుగా పెంచారని రైతులు ఆరోపించారు. పెంచిన ధరలు తగ్గించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. కాగా ప్రస్తుతం మండలానికి వచ్చిన జీలుగ విత్తనాలు సరిపోవని, మరిన్ని విత్తనాలు కేటాయించాలని రైతులు అధికారులను కోరారు.

అందుబాటులో ఉంచాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ, సీడ్ డెవలప్‌మెంట్ అధికారులను సమన్వయం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జి ల్లాలోని అన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన హెచ్చరికలు జారీ చేయాలని పేర్కొన్నారు.

నడవలేం.. నడపలేం..



గుంతలమయమైన రోడ్డు



కంకర తేలి అధ్వానంగా రోడ్డు దుస్థితి

గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారి పల్లెదారుల గుండా నడవలేని దుస్థితి నెలకొన్నది. మండలంలోని బర్దిపూర్ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా కంకర తేలి అడుగడుగునా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బర్దిపూర్ నుంచి పల్వంచ గ్రామానికి వెళ్లే రహదారి చెరువు కట్టపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరమ్మతులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. టేక్మాల్(మెదక్):

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలో 29 నుంచి 31వరకు జరిగే శ్రీ ఆంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలను రావాలని ఎమ్మెల్యే సునీతారెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మె ల్యే ఇంటి వద్దకు ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, గ్రామస్తులు భిక్షపతి, సత్యనారాయణ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు.



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ముట్రాజ్‌పల్లి గ్రామస్తులు

విస్తరిస్తున్న మైక్రో ఫైనాన్స్‌లు

- అమాయక ప్రజలే టార్గెట్
- అప్పుల ఊబిలో చిక్కుకొని విలవిల



మెదక్ కలెక్టరేట్: వ్యక్తిగత అవసరాలు, వ్యాపారం, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌ల నుంచి అప్పులు తీసుకున్న వారి బాధలు వర్ణనాతీతం. ఏ ఒక్క వాయిదా సకాలంలో చెల్లించక పోతే ఫైనాన్స్‌లు చుక్కలు చూపిస్తున్నాయి. వారి వేధింపులు తట్టుకోలేక తన కుటుంబాన్ని కాపాడాలంటూ కొడిపల్లి మండలం సలాబత్‌పూర్‌కు చెందిన ఎర్రోళ్ల శేఖర్ ఈనెల 26న ప్రజావాణిలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. అవసరాలకు అప్పులు తీసుకున్నా...ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో బాధ పడుతున్నామని, కొంత గడువు ఇవ్వమంటే వేధిస్తున్నారని వాపోయాడు. ప్రస్తుతం కుటుంబమంతా ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని భార్యాభర్త పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. ఇది జిల్లాలో వెలుగుచూసిన ఒక ఘటన మాత్రమే. పరువు పోతుందని బయట పడని ఇలాంటి బాధితులు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు.

జిల్లాలో మళ్లీ విస్తరణ

గతంలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు జిల్లాలో చాపకింద నీరులా మళ్లీ విస్తరిస్తున్నాయి. అమాయకులను ఆసరాగా తీసుకొని అప్పులు అంటగడుతూ తిరిగి వసూళ్ల కోసం వేధింపులకు గురిచేస్తున్నాయి. వీరి వేధింపులు భరించలేక 2010లో జిల్లాలోని చిన్న శంకరంపేట మండలం చెన్నాయిపల్లి గ్రామంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులు తట్టుకోలేక ఒక గృహిణి తన ఇద్దరు పిల్లలను బావిలో పడేసి, తాను దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లను రద్దు చేసింది. రెండు, మూడేళ్ల నుంచి జిల్లాలో మళ్లీ మైక్రో ఫైనాన్స్‌లు తమ వ్యాపారాలను విస్తరిస్తున్నాయి.

జిల్లాలో 14 వరకు ఫైనాన్స్‌లు

జిల్లాలో ఫిన్‌కేర్, బంధన్‌బ్యాంక్, క్రిస్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, ఐఎఫ్ఎల్, ఆదర్శ్ బ్యాంక్, ఆశీర్వాద్, భారత్, క్రెడిట్, ముత్తూట్, హెచ్‌డిబి వంటి మొత్తం 14 ఫైనాన్స్‌లు కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని ఫైనాన్స్‌లు వ్యక్తిగతంగా అప్పులు ఇస్తుండగా, మరికొన్ని బ్యాంకులు మహిళలను గ్రూప్‌లుగా చేసి అప్పులు ఇస్తున్నాయి. వీటితోడు ఇతర జిల్లాలకు చెందిన వడ్డీ వ్యాపారులు వారం అప్పులు ఇస్తున్నారు.

నిరుపేద ప్రజలే టార్గెట్:

ఫైనాన్స్ అధికారులు ముందుగా ఒక గ్రామంలో పేద ప్రజలు ఎక్కువగా ఉండే వీధిని ఎంపిక చేసుకుంటారు. అక్కడ ఒక్కరిద్దరు మహిళలను కలిసి 5 నుంచి 10 మంది ఒక గ్రూపుగా ఏర్పడితే ఎలాంటి పూచికత్తు లేకున్నా అప్పు ఇస్తామని ఆశ చూపుతారు. అప్పు ఇచ్చే సమయంలో వారి నుంచి ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు తీసుకుంటారు. గ్రూప్‌లోని సభ్యులందరికి ఒకరికొకరిని పూచికత్తుగా తీసుకుంటారు. ఒకరు అప్పు కట్టకుంటే పూచికత్తు ఇచ్చిన మిగతా మహిళలంతా కలిసి కట్టాలని సూచిస్తారు. వారం వారం అప్పులు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని ఫైనాన్స్‌లు నెలవారి అప్పులు ఇస్తున్నాయి.

ఒక్కో వీధిలో ఐదారు ఫైనాన్స్‌లు

ఒక గ్రామంలోని ఒక వీధిలో ఒక ఫైనాన్స్ మహిళలను గ్రూప్‌గా చేసి అప్పులు ఇస్తుంది. ఇది గమనించిన మిగతా ఫైనాన్స్‌లు కూడా ఆ వీధిలో చేరి మహిళా గ్రూప్‌లను తయారుచేసి అప్పులు ఇస్తాయి. ఇలా ఒక్కో వీధిలో ఐదారు ఫైనాన్స్‌ల నుంచి అప్పులు తీసుకున్న మహిళలు ఉన్నారు. అన్ని గ్రూపుల్లో ఆ మహిళలే ఉంటారు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యల కారణంగా సకాలంలో వాయిదా చెల్లించకుంటే ఫైనాన్స్ ఇచ్చిన వారు మిగతా సభ్యులను పురిగొల్పి పక్కకు తప్పుకుంటారు. అప్పు తీసుకొని కట్టని వారిని అడగకుండా మిగతా సభ్యులను రెచ్చగొడతారు. దీంతో మిగతా సభ్యులంతా అప్పు కట్టాల్సిన వారి ఇంటి వద్దచేరి నానా రభస చేసి పరువు తీస్తారు. ఏదైన ఆస్తి ఉంటే అమ్ముకొని కడుతున్నారు. లేదంటే మరో గ్రూప్‌లో అప్పు తీసుకుంటారు. ఒక అప్పు కట్టేందుకు మరో గ్రూప్‌లో అప్పు తీసుకోవడం, ఇలా ఒకదాని వెంట ఒకటి అప్పులు పెరిగిపోయి కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ విస్తరిస్తున్న మైక్రో ఫైనాన్స్‌లను అరికట్టి ప్రజల వ్యాపారాలకు బ్యాంకులు రుణాలు అందించాలని మహిళలు కోరుతున్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఏడీఏ, ఎస్ఐ హెచ్చరిక



రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏడీఏ, ఎస్ఐలు

రామాయంపేట (మెదక్) : నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) రాజ్‌నారాయణ, ఎస్ఐలు బాల్‌రాజ్, మల్లికార్జున్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్‌తోపాటు రిజిస్టర్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, రైతులకు నాసిరకం అంటగడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్న క్రమంలో రైతులు విధిగా రసీదు తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు.

శాలిపేట ప్రీమియర్ లీగ్ ప్రారంభం



లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న రాజు

చిన్నశంకరంపేట(మెదక్):మండలంలోని శాలిపేట గ్రామంలో శాలిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను చిన్నశంకరంపేట మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ సర్పంచ్ సాయం పోచయ్య మంగళవారం ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ఎంహెచ్ రైజర్స్, ఆర్కే వారియర్స్ జట్లు తలపడగా టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ పోటీల్లో గ్రామంలోని ఆరుజట్లు పోటీపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శంకర్, వెంకట్, రాజు, తిరుపతి, మహేశ్, నాగరాజు, పాండు, సురేశ్‌గౌడ్, ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ మట్టి దందా



అక్రమ మట్టితో వేసిన రోడ్డు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లిలో కొద్ది రోజులుగా జోరుగా అక్రమ మట్టి దందా కొనసాగుతుంది. ప్రభుత్వ భూమిలో నుంచి ప్రైవేటు వ్యక్తుల భూములకు రోడ్డు వేసేందుకు ఈ మట్టిని తరలిస్తున్నారు. గతంలో సైతం ఈరన్న చెరువు నుంచి రోడ్డు ఏర్పాటు కోసం అక్రమంగా మట్టిని తరలిస్తున్న కథనాన్ని సాక్షి ప్రచురించినా అధికారులు స్పందించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయమై నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉన్నత చదువుతోనే సమాజంలో గౌరవం



బాలికల ఉన్నత పాఠశాలలో టాపర్లకు సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్): ఉన్నత చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని అధ్యాపకులు అన్నారు. స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సాజిత్‌అలి ఆధ్వర్యంలో కేరీర్ గైడెన్స్ ట్రయినర్ అమూల్య, జీజేసీ లెక్చరర్, నోడల్ అధికారి మధురశ్రీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పదో తరగతి పూర్తయిన తర్వాత ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై వివరించారు. ప్రభుత్వ కాలేజీలు అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులు పూజ, నిహారికను సన్మానించారు. ఉపాధ్యాయురాలు అనిత, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగు, ఎస్ఎస్ఎఫ్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. నేడు ట్రీకటింగ్, విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని ఆయన కోరారు.

చిన్నశంకరంపేటలో...

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ కేంద్రం పరిధిలోని గవ్వలపల్లి ఫీడర్, మడూర్, శాలిపేట విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దినకర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గవ్వలపల్లి ఫీడర్, మడూర్, శాలిపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దశలవారీగా గ్రామాల అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న సౌజన్య తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీఓ సౌజన్య అన్నారు. మంగళవారం మండలంలోని అత్నూర్‌లో రూ.15 లక్షలుతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పథకంతో పాటు ఇతర పథకాల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల సమస్య దూరమైందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, మాజీ జెడ్పీటీసీ శివాజీ పాటిల్, పంచాయతీ కార్యదర్శి శారీన్ పాల్గొన్నారు.

బిక్యా తండాలో తాగునీటి ఎద్దడి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న బిక్యాతండా వాసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని బిక్యా తండాలో తాగునీటి ఎద్దడితో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని తండావాసులు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తండాలోని సింగిల్ ఫేజ్ మోటారు సైతం పని చేయడం లేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి తండాకు తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రధాన కూడళ్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

డీఎస్పీ నరేందర్‌గౌడ్



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ప్రధాన కూడళ్లో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరు పరిశీలించాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం రాత్రి శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎస్ఐ మధుకర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. మండలంలో ఉన్న పరిశ్రమలు, ఇతర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చాకరిమెట్ల ఆదాయం రూ.13 లక్షలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకాల కోసం మంగళవారం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన హరిసింగ్‌నాయక్ రూ.13 లక్షలకు దక్కించుకున్నారు. సంవత్సరం పాటు దేవాదాయ శాఖ నిబంధనల మేరకు అమ్మకాలు జరుపుకునేందుకు హక్కు పొందారని ఈఓ శ్రీనివాస్, ఆలయ పౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, సిబ్బంది రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, గ్రామమస్తులు కిషన్‌రావు, నరేందర్, చంద్రయ్య, దశరథ్, పాపయ్యచారి, వీరాస్వామి, హరిసింగ్, మహేష్, తదితరులు ఉన్నారు.

◆ యోగా పై అవగాహన

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయుష్ శాఖ యోగా శిక్షకుడు మద్దెల భరత్ మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ప్రాణాయామం, ధ్యానం, సూక్ష్మ యోగా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యోగా శిక్షణతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని సూచించారు. మున్సిపల్ చైర్మన్ దేవేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు, వలంటీర్లు, మెప్మా ఆర్పీలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఇన్‌చార్జి ఎంపీడీఓగా షాకీర్ అలీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా షాకీర్ అలీ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన విఠల్‌రెడ్డి ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో ఆయన స్థానంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న షాకీర్ అలీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఆయన్ను అభినందించారు

◆ సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలంలోని బచ్చురాజ్‌పల్లికి చెందిన అనితకు మంజూరైనన రూ.43 వేల సీఎం సహాయనిధి చెక్కును బీజేపీ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): శనేశ్వరస్వామి జయంతి సందర్భంగా మండలంలోని వెల్మకన్నలోగల శనేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు తైలాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

◆ గో సంరక్షణకు చర్యలు చేపట్టండి

చిన్నశంకరంపేట(మెదక్): గోవులను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మన్నన్‌కు బీజేవైఎం నాయకులు మంగళవారం వినతి పత్రం అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొగుల రాజు మాట్లాడుతూ చట్టం ప్రకారం గోవధ నివారణకు చర్యలు అమలు చేయాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నారాయణగౌడ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవి, సురేష్‌గౌడ్, దశరథం, నార్సింగిలో జరిగిన కార్యక్రమంలో సత్యపాల్‌రెడ్డి, లింగారెడ్డి, గురుపాతం, లక్ష్మణ్, హరిబాబు, నర్సింహులు, నరేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకొని వస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గంలోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు స్వామివారిని దర్శించుకున్నారు.